క్లుప్తంగా

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామివార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాభంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరి నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

తుంగతుర్తి : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో హరితహారంపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పంపిణీ చేస్తున్నారని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. సాంస్కృతిక సారధి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఉదయ్‌కిరణ్‌కు దాతల ఆర్థికసాయం

మునగాల : మండల కేంద్రంలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన బీటెక్ విద్యార్థి లంజేపల్లి ఉదయ్‌కిరణ్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో 'పేద కుటుంబానికి అనుకోని కష్టం' అనే శీర్షికతో వార్తాకథనం ప్రచురితం కావడంతో పలువురు దాతలు స్పందించి ఉదయ్‌కిరణ్ వైద్యచికిత్సకు ఆర్థికసాయం అందిస్తున్నారు. మంగళవారం సుమారు రూ.50 వేల పైచిలుకు ఆర్థికసాయం అందించగా బుధవారం కూడా పలువురు దాతలు ఆర్థికసాయం అందించారని ఉదయ్‌కిరణ్ సోదరుడు వేణుగోపాల్ తెలిపారు.

మత్స్య సొసైటీ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలి

నేరేడుచర్ల : మండలంలోని వైకుంఠాపురంలోని మత్స్య సొసైటీ సభ్యులను ఆదుకోవాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులపై ఆధారపడిన తమకు ఏడాదికి ఒక్కసారి చేపలు పడితేనే కొంత డబ్బులు వస్తున్నాయని, వాటితో జీవనం సాగించడం కష్టంగా ఉందన్నారు. చెరువులపై మత్స్య కార్మికులను దినసరి కూలీలుగా గుర్తించి రోజుకు రూ. 500 రూపాయలు వచ్చే విధంగా ఉపాధి కల్పించాలన్నారు. సంఘ సభ్యులు ప్రమాదానికి గురైతే రూ. 5 లక్షల బీమా వర్తింపజేయాలన్నారు. మత్స్యకారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, మూడెకరాల భూమి, 50 ఏళ్లు దాటిన వారికి రూ. 5వేల పింఛను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బోర్డు తొలగింపుపై విచారణ జరిపించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పీర్లకోటం బజారులో గల పాత వాటర్ ట్యాంక్ ఖాళీ స్థలంలో ఇది మున్సిపాలిటీ స్థలం అని ఉన్న బోర్డుని తొలగించిన విషయంపై విచారణ జరిపించాలని ఆ వార్డులోని పలువురు కోరారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలం అని ఉన్న బోర్డుని తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆకుల రాము, కారింగుల వెంకన్న, రాగి రాజశేఖర్, కె.నరసరావు, బి.ప్రసాద్, ఆర్.గోపి, ఐ.రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెండర్లు పిలువకుండానే..!

కోదాడలో పీర్లకొట్టం నిర్మాణం చేపట్టిన మున్సిపల్ యంత్రాంగం

- అధికార, విపక్ష కౌన్సిలర్లు కుమ్మక్కయ్యారని ఆరోపణలు
- అధికారుల వింత పోకడపై సర్వత్రా చర్చ



టెండర్ పిలవకుండానే నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం జరుపుకున్న పీర్లకొట్టం

కోదాడ: కోదాడ మున్సిపాలిటీలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఇష్టారాజ్యం నడుస్తోంది. నింబంధనలు భేఖాతరు చేస్తూ మున్సిపాలిటీ పనులను తమ ఇష్టం వచ్చినట్లు చేసేస్తున్నారు. ప్రశ్నించాల్సిన విపక్ష నేతలు కూడా అధికార పక్షంతో చేతులు కలపడంతో ఇక వారికి ఎదురే లేకుండా పోయింది. తాజాగా శనివారం కోదాడలో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. పట్టణ పరిధిలోని 33వ వార్డులో రూ.ఐదు లక్షల నిధులతో పీర్లకొట్టం నిర్మాణం చేపట్టాలని గత మున్సిపాలిటీ సమావేశంలో తీర్మానం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు వ్యవహారం ఆ తరువాతే జరిగింది. ఈ పీర్లకొట్టం నిర్మాణానికి టెండర్లు పిలిచి కాంట్రాక్టను ఎంపిక చేసి పనులు చేయించాల్సి ఉంది. కానీ, టెండర్లు పిలువకుండానే నిర్మాణ పనులు చేపట్టారు. రెండు నెలల్లోనే ఆ వార్డుకు చెందిన ప్రజాప్రతినిధి పనులు పూర్తి చేసి శనివారం స్థానిక ఎమ్మెల్యే చేత ప్రారంభోత్సవం కూడా చేశారు. దీని విషయంలో మున్సిపల్ అధికారుల వింతపోకడపై సర్వత్రా చర్చించుకుంటున్నారు.

అధికార, విపక్షం భాయ్.. భాయ్

కోదాడ మున్సిపాలిటీలో అధికార, విపక్షానికి చెందిన కౌన్సిలర్లు కలిసిపోయి పనులు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో జరిగే అన్ని రకాల పనులు కాంట్రాక్టర్ల పేరుతో మంజూరైనా చేసేది మాత్రం అధికార, విపక్షానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులేనని.. వారే అన్నిరకాల పనులను చక్కబెడుతున్నారని పలువురు కౌన్సిలర్లే అంటున్నారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వీరికి పనులు ఇవ్వకపోతే రకరకాల కొర్రీలు పెట్టి ఇబ్బంది పెడుతుండడంతో కాంట్రాక్టర్లు కూడా వీరు చెప్పినట్టే చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు కూడా సదరు నేతలకే వంత పాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

అత్యవసరంగా పనులు చేశాం

33వ వార్డులో పీర్లకొట్టం నిర్మాణానికి కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. కానీ, నిర్మాణానికి టెండర్లు పిలవని మాట వాస్తవమే. మైనార్టీ వర్గానికి చెందిన ఆ వార్డు కౌన్సిలర్ మొహర్రం పండుగ వరకు నిర్మాణం పూర్తి చేయాలని కోరడంతో అత్యవసరంగా పనులు చేశాం. అవసరమైతే నామినేషన్ పద్ధతిలో కేటాయించడానికి కలెక్టర్ అనుమతి తీసుకుంటాం.

– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

ప్రభుత్వ బడుల్లో 'కార్పొరేటు' విద్య

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం : పాఠశాలలో గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : కాపుగల్లులో ధాన్యం గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నడిగూడెం : విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని , ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించి విద్యనందిస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రత్నవరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.37 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన, అలాగే బృందావనంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.12 లక్షలతో కల్పించిన మౌలిక వసతులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వేవబత్తిని వెంకటనర్సయ్య, సర్పంచ్‌లు పగడాల పద్మ, హనుమయ్య, పీఏసీఎస్ చైర్మన్ రమేష్, ఎంపీటీసీ సునీత, ప్రధానోపాధ్యాయులు ముజీబూర్ రెహ్మాన్, భద్రారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మన ఊరు– మన బడి'తో బడులకు మహర్దశ

మునగాల : మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు– మన బడి ద్వారా ఏర్పాటు చేసిన మౌలిక వసతులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో నిర్మించిన కబరస్తాన్ ప్రహరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలు నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండీ.సలీమ్ షరీఫ్, సర్పంచ్ కొప్పుల వీరమ్మ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఉప్పుల ఇంద్రారెడ్డి, ముస్లిం నాయకులు షేక్ దస్తగిరి, షేక్ పాషా, నాయకులు రమేష్‌బాబు, వీరయ్య, నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు సేవలు

కోదాడరూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో రైతులకు మరిన్ని సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాపుగల్లు పీఏసీఎస్ పరిధిలో రూ.70 లక్షల నాబార్డు నిధులతో చేపట్టిన ధాన్యం గోడౌన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత పాలకులు సహకార సంఘాలను నిర్వీర్యం చేశారని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక వాటిని అన్ని విధాలుగా బలోపేతం చేస్తుందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లో కాకుండా ధర వచ్చిన తర్వాత అమ్ముకునేందుకు ధాన్యం గోడౌన్‌లను వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, సంఘం చైర్మన్ నంబూరి సూర్యం, శేషు, సతీష్, శ్రీనివాస్, పాపారావు, రాజు, బోస్ తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



మాట్లాడుతున్న మండల వైద్యాధికారిణి సన

హుజూర్‌నగర్‌రూరల్ : చిన్నారులు, విద్యార్థులకు అల్బెండజోల్ (నులిపురుగుల నివారణ) మాత్రలు వేయించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ సన కోరారు. బుధవారం మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా గల 48 అంగన్‌వాడీ కేంద్రాలు, 33 ప్రభుత్వ పాఠశాలలు, 15 ప్రైవేటు పాఠశాలలు, 3 జూనియర్ కాళాశాలలలో 11 వేల 473 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు, విద్యార్థులకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్‌ఎన్ నూర్జహన్, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, రామకృష్ణ, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల కాలయాపన తగదు

హుజూర్‌నగర్ : వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడాల్సిన అధికారులు కాలయాపన చేయడం తగదని ముస్లిం మైనార్టీ నాయకుడు అజీజ్ పాషా అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఉస్మానియా మజీద్ ఆవరణలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు అధికారులు వచ్చి షాపును ఎందుకు స్వాధీనం చేసుకోవటం లేదో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నవాబ్ జానీ, జిలాని, పహిల్వాన్, మజీద్, ఇబ్రహీం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి



నేరేడుచర్ల : బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత



హుజూర్‌నగర్‌రూరల్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీ సుధారాణి

నేరేడుచర్ల : ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ సరిత, నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కమలాకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన పారదర్శకంగా చేయాలన్నారు. ఓటరు జాబితాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే బీఎల్‌ఓలకు ఓటరు నమోదుకు ఉపయోగించే 16 పత్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అక్టోబర్ 1వ తేదీ 2005కు ముందు పుట్టిన వారు ఓటు హక్కు పొందేందుకు అర్హులని తెలిపారు. మార్పులు, చేర్పులు, తొలగింపులు, నూతన ఓటరు నమోదు, కుటుంబంలో వేర్వేరు బూత్‌ల్లో ఓటు హక్కు పొందిన వారిని ఒకే బూత్‌లోకి తీసుకొచ్చేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ నర్సయ్య, అన్ని గ్రామాల బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణలో బీఎల్‌ఓల పాత్ర కీలకం

హుజూర్‌నగర్‌రూరల్ : ఓటరు జాబితా సవరణలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ వజ్రాల జయశ్రీ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణపై బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఫొటో ఎలక్టరల్స్ 2వ ఎస్‌ఎస్‌ఆర్ 2023 పై బూత్ లెవల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. నూతన ఓటర్ల నమోదు, సవరణ చేయడంలో బీఎల్‌ఓలు కీలకంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. బీఎల్‌ఓ యాప్, ఈ జాబితా, డేటా బెస్‌లోని లోపాలు వివరాలు వంటి విషయాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీలు సుధారాణి, లావణ్య, సీనియర్ అసిస్టెంట్ సుశీల, ఆర్‌ఐలు షరీఫ్, సూర్యనారాయణ, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : మరమ్మతులు పూర్తయిన శివగంగా లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతులను ఆదుకునేది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు వద్ద మరమ్మతులు చేసిన శివగంగా లిఫ్టును బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చింతలపాలెం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లిఫ్టుల పరిస్థితి గురించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఇంజనీరింగ్ బృందాలను పంపించి త్వరితగతిన వేల ఎకరాలకు నీరు అందేందుకు కృషి చేశారని తెలిపారు. లిఫ్ట్‌ల మరమ్మత్తులకు నిధులు కేటాయించి వాటిని నడిపిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తున్నది దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని మూడు పంటలు పండించే బీఆర్‌ఎస్ పార్టీ కావాలో 3 గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలో రైతులే నిర్ణయించుకోవాలన్నారు. ఎంపీ రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేదని, 3 గంటలు చాలన్న ఆయన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెంతలపాలెంకు చెందిన వారి కుటంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ స్వామి, ఏఈఈ కె.శ్రీనివాస్, ఏఈ నాగార్జున, శాంతయ్య, ఎంపీపీ కె.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సైదిరెడ్డి, యర్రం లక్ష్మారెడ్డి, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చింతలపాలెం మండలం తమ్మవరంలో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతరం కిష్టాపురంలో చింత్రియాల క్లస్టర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. తదనంతరం చింత్రియాలలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ, మద్దిరాలమ్మ, ముత్యాలమ్మ మందిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రెండు రోజుల క్రితం మృతి చెందిన వజినేపల్లి సర్పంచ్ బాల భాస్కర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన రెప్పకుంట్ల కొండాను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం చింతలపాలెంలోని శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వాల పాలనలో దేవాలయాలు నిర్వీర్యం అయ్యాయని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆలయాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం నూతన పాలకమండలి చైర్మన్‌గా యారబోలు అంకిరెడ్డి, సభ్యులుగా కందుల వరలక్ష్మమ్మ, మాతంగి రమేష్, తోడేటి గోవింద్, బానోవత్ గాంధీలతో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రమేష్, ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.వెంకటరెడ్డి, ఎంపీటీసీలు సైదిరెడ్డి, మహత్యం, ఈఓ లక్ష్మణరావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు నాయకుల మద్దతు



హుజూర్‌నగర్‌రూరల్ : సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్



చిలుకూరు : కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న బెల్లంకొండ సత్యనారాయణ



మఠంపల్లిలో సమ్మె చేస్తున్న కార్మికులు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బ్లాక్ కాంగ్రెస్ హుజూర్‌నగర్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట గత 14 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. మల్టిపర్పస్ విధానాన్ని ఎత్తివేసి పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు యరగాని గురవయ్య, నాయకులు యరగాని భిక్షం, నర్సింహారావు, జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హసన్‌మియా, వీరారెడ్డి, నాగరాజు, వెంకటరెడ్డి, కనకయ్య, రంగారెడ్డి, మట్టయ్య, వీరస్వామి, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

21 కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

చిలుకూరు : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు చేసున్న సమ్మెకు బుధవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ జీపీ కార్మికులకు పీఆర్‌సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు, పంప్ ఆపరేటర్లకు జీతాలు ఇవ్వాలన్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 21 నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాను (చలో కలెక్టరేట్)లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని జీపీ కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కట్టికోల శ్రీనివాస్‌రావు, కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్, షేక్ జాకీర్‌హుస్సేన్, వడ్రాణపు తిరపయ్య, పట్టపాక నాగేశ్వరరావు, దానియా, సైదయ్య, నాగేంద్రబాబు, శ్రీను, కిరణ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన కార్మికుల రిలే దీక్ష

మఠంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలే దీక్ష బుధవారం వర్షంలోనూ కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ ఉద్యోగాలకు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, పిచ్చయ్య, గురువారెడ్డి, దేవదానం, సుశీల, నాగయ్య, అంజయ్య, బాలు, దావీదు, బాబు, కోటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైదమ్మ మృతి సీపీఎంకు తీరని లోటు



సైదమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, నాయకులు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సొంపంగు గుర్వయ్య భార్య సైదమ్మ మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం నర్సింహులగూడెంలో నిర్వహించిన సైదమ్మ దశదినకర్మ కార్యక్రమంలో వారు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారు మాట్లాడారు. సైదమ్మ కుటుంబం గ్రామంలో సీపీఎం పురోభివృదికి ఎంతో కృషిచేసిందన్నారు. గ్రామంలో పార్టీ తీవ్ర నిర్బంధాలు ఎదుర్కొన్న సమయంలో సైదమ్మ భర్తకు అండగా నిలిచి పార్టీని కంటికి రెప్పలా కాపాడుకున్నారని కొనియాడారు. సైదమ్మ మృతి పట్ల ఆమె కుటుంబానికి సీపీఎం రాష్ట్ర పక్షాన సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, మండల కార్యదర్శులు చందా చంద్రయ్య, రాపోలు సూర్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు షేక్ సైదా, వీరబోయిన వెంకన్న, తుమ్మల సతీష్, మారం వెంకటరెడ్డి, శ్రీరాములు, ఉదయమ్మ, భగత్‌సింగ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హరితహారం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి



చాకిరాలలో మొక్క నాటుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : హరితహారం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. బుధవారం మండలంలోని చాకిరాలలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

సూర్యాపేటటౌన్ : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్ అన్నారు. బుధవారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ తెలంగాణ సాధన పోరాటస్ఫూర్తితో ఉద్యమం చేస్తే సమస్యలు తప్పకుండా పరిష్కారం అవుతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అమరవాది బ్రహ్మచారి, జూలకంటి వెంకట్‌రెడ్డి, నాగరాణి, మురళీకృష్ణ, దీపాదేవి, ఇందిర, పద్మశ్రీ, విజయ్‌భాస్కర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



నడిగూడెంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నడిగూడెం : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎండీ.జలీల్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బోనగిరి ఉపేందర్, నాయకులు అమరబోయిన సైదారావు, శివకృష్ణ, మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్టు విధానాలపై ఉద్యమించాలి



కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మోదీ ఫాసిస్టు విధానాలపై, నల్లచట్టాల రద్దుకై ఉద్యమించడమే పజ్జూరి కృష్ణారెడ్డికి ఘనమైన నివాళి ఘటించినట్లని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో గోదావరిలోయ ప్రతిఘటనోద్యమ నాయకుడు పజ్జూరి కృష్ణారెడ్డి 23వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పీడిత, అణగారిన వర్గాలకోసం చంద్ర పుల్లారెడ్డి రూపొందించిన ప్రతిఘటన పోరాట వెలుగులో కృష్ణారెడ్డి ఉద్యమించాడని తెలిపారు. వారి ఆశయాల సాధనకు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అలుగుబెల్లి వెంకటరెడ్డి, కారింగుల వెంకన్న, దశరథ, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభానికి పిలవకపోవడం శోచనీయం

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు –మన బడి పథకంలో భాగంగా రూ.37 లక్షల వ్యయంతో బుధవారం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు తనను పిలవకపోవడం శోచనీయమని ఆ గ్రామ ఉపసర్పంచ్ మొలుగూరి ఉపేందర్ బుధవారం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తరగతి గదుల నిర్మాణ పనులను ప్రారంభించారని, కార్యక్రమంలో గ్రామానికి చెందిన అనేక మంది పాల్గొన్నారని కానీ దళిత ఉప సర్పంచ్‌ననే ఒక్క కారణంతోనే తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చంద్రబాబు శిష్యుడే

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ మాజీ సీఎం చంద్రబాబు శిష్యుడే అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండవ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడు అంటూ బీఆర్‌ఎస్ నాయకులు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని, బీఆర్‌ఎస్‌లో ఉన్న 90 శాతం మంది కూడా చంద్రబాబు శిష్యులేనన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలన్నారు.